

చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.6




ప్రైవేట్ వరి విత్తనాల పాగా

● వినూత్న పేర్లు, అందమైన ప్యాకింగ్‌లో రైతులను ఆకట్టుకునేలా ప్రచారం

7

సీఎం పర్యటనపై ఎన్నో ఆశలు!



» నేటి నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పర్యటనలు

» నేడు యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

» ఉమ్మడి జిల్లాలో నాలుగోసారి అధికారికంగా పర్యటన

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలేరు నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక మూసీ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఆ తర్వాత హుజూర్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తాననే సీఎం హామీ మేరకు తొలుత ఆలేరు నియోజకవర్గంలో శుక్రవారం సీఎం పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మకమైన గంధమల్ల రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయడంతో పాటు, తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ వద్ద ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం ఇక్కడే ఏర్పాటు చేయనున్న బహిరంగసభలో మాట్లాడుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. కీలకమైన పథకాలు, పనులకు సీఎం హామీ ఇస్తారని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వాసులు ఆశిస్తున్న పనులివే..

● యువతకు ఉపాధి కల్పన నిమిత్తం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, అనుముల, డిండి, హుజూర్‌నగర్, ఆలేరు, భువనగిరిలో నిర్మాణంలో ఉన్న ఏడు ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు)లలో పెండింగ్ పనులు పూర్తిచేసి ఈ విద్యాసంవత్సరం నుంచే వాటిని అందుబాటులోకి తేవాలి.

● ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట మినహా మిగిలిన 11 నియోజకవర్గాలకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులు తక్షణం ప్రారంభించాలి.

● తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఉమ్మడి జిల్లాలోని మూడు ప్రాంతాలకు ఒక్కోటి చొప్పున కేటాయించాలి.

● కోదాడలో ఉమెన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

● అన్ని మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు, నియోజకవర్గ కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

● ఉమ్మడి జిల్లాలో జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి. అదేవిధంగా మహాత్మాగాంధీ యూనివర్శిటీ పరిధిలో బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, లా కాలేజీలు ఏర్పాటు చేయాలి.

● ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.

● ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేయాలి. ప్రతీ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24గంటలు నడిచేలా ఏర్పాటు చేయడంతో పాటు, 30 పడకల స్థాయికి పెంచాలి.

● మోత్కూరులో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలి.

● ఉమ్మడి జిల్లాలో మిగతా 7వ పేజీలో...



యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

సభకు సర్వం సిద్ధం

తుర్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో సీఎం సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుగనుంది. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ. 1,500కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం ఇక్కడే శంకుస్థాపన చేస్తారు. తదనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అందుకు భువనగిరి-గజ్వేల్ రహదారి పక్కన ఐదెకరాల విస్తీర్ణంలో సభా వేదిక నిర్మాణంతో పాటు ప్రజలు కూర్చునేందుకు వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం మరో 20ఎకరాల స్థలాన్ని కేటాయించారు. వేదిక ముందు భాగంలో మీడియా, వీఐపీ, ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వీఐపీల పార్కింగ్‌కు మరో నాలుగు స్థలాలతోపాటు ప్రజలు సభా ప్రాంగణానికి రెండు వైపుల నుంచి వచ్చేలా ఏర్పాటుచేశారు.

రెండు పెద్ద ఎల్‌ఈడీ తెరలు

సభా వేదికను 60 అడుగుల పొడవు 40 అడుగుల వెడల్పుతో 100 కూర్చునేందుకు అనువుగా ఏర్పాటు చేశారు. సభా వేదికకు ఇరువైపులా ప్రజలు వీక్షించేందుకుగా రెండు పెద్ద ఎల్‌ఈడీ తెరలు, అక్కడక్కడ చిన్న చిన్న ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. సభా వేదికకు సుమారు మిగతా 7వ పేజీలో...

నేటి నుంచి బడిబాట

» ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు లక్ష్యం

» ఉపాధ్యాయులకు పరీక్షగా మారిన అడ్మిషన్లు

» ఇప్పటికే ప్రారంభమైన ప్రైవేట్ పాఠశాలల ప్రచార జోరు



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు (ఫైల్)

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం (2025-26) ఈ నెల 12న ప్రారంభం కానుంది. దీంతో ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నిర్వహించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట పేరుతో పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది.

విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు మల్టీకలర్ కరపత్రాలు, బ్యానర్లతో పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతీ ఇంటికి తిరుగుతున్నారు. పాఠశాలల ఘనత, సాధించిన ఫలితాలను వివరిస్తూ పిల్లలను చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే యాజమాన్యాలు కూడా టీచర్లకు టార్గెట్ విధించి అడ్మిషన్ల సంఖ్య ఆధారంగా ఇన్సెంటివ్స్ ఇస్తుండగా, కొన్ని పాఠశాలలు నిర్దేశిత సంఖ్యలో నూతన విద్యార్థులను చేర్పిస్తేనే వేసవి వేతనం ఇస్తామని తేల్చిచెప్పాయి. అంతేగాక విద్యార్థులను చేర్పించని ఉపాధ్యాయులను తొలగిస్తామంటూ హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అధికమంది పేద, మధ్య తరగతికి చెందినవారే ఉండటంతో వారి జీవనోపాధిని కాపాడుకునేందుకు ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా సాధారణ ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అలాంటి కఠినతర ఇబ్బందులు లేకున్నా, పాఠశాలల్లో ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను నిర్వహించనున్నారు. కనీస సంఖ్యలేని పాఠశాలలను మూసివేస్తూ ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు తాత్కాలిక సర్దుబాటు చేసే మిగతా 7వ పేజీలో...

పునఃప్రారంభానికే ముందే

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఈనెల 12వ తేదీలోగా తరగతి గదులు, పరిసరాలను శుభ్రం చేయించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు పుస్తకాలు, ఒక జత యూనిఫాం పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు భవిత కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచనున్నారు. భవిత కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించి పరిపాలన అనుమతులు మంజూరు చేయగా, పనులు కొనసాగుతున్నాయి. బడిబాటలో భాగంగా వీటిలో విద్యార్థులను చేర్పించనున్నారు.

పేదల ఇంటికల నెరవేర్చే వరకూ పోరాటం



మునుగోడులో ఇందిరమ్మ ఇళ్ల పట్టాను లబ్దిదారుకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మునుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరే వరకూ పోరాడుతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పండుగ వాతావరణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టి అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దశల వారీగా పేదలందరికీ ఇవ్వాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గ పరిధిలో 10వేల మంది అర్హులు ఉంటారని, కానీ తొలి విడతలో 3,500 ఇళ్లు మాత్రమే వచ్చాయన్నారు. మిగిలిన అర్హులందరికీ ఇప్పించే బాధ్యత తనదని, ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని హితవు పలికారు. ఇల్లు అనేది ఆత్మగౌరవమని, ఇంటితోనే మహిళకు అందం వస్తుందన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు ఇళ్లు ఇవ్వడం సంతోషకరమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మిగతా వారికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్దిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 200 మంది లబ్దిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి జాబితాను 5శాతం ర్యాండంగా పరిశీలన చేసి లబ్దిదారులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో 2,100మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్దిదారులు 30రోజుల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నారాయణ అమిత్, జె.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదమా.. అనుమానాస్పదమా?

● మారెడ్డి శిల్ప మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు ● స్టేషన్‌లో ఫిర్యాదు



వివరాలు 6లో

సాగర్ కుడికాల్వకు నీటివిడుదల నిలిపివేత

● 13 క్రస్ట్‌గేట్లకు కొనసాగుతున్న మరమ్మతులు ● రెండు రోజుల్లో పూర్తి



వైభవంగా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ



జాతర ప్రారంభ పూజల్లో పాల్గొన్న చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతులు, ఈవో జయరామయ్య, ఆలయ ధర్మకర్తలు

కనగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, లలితసహస్రనామార్చనలు, బాలభోగ నివేదనలు జరిగాయి. అనంతరం ఉదయం ధ్వజారోహణ, దేవీమూలమంత్ర హోమాలు, మండప పూజలు, నీరాజన మంత్రపుష్పం, మహానివేదన, గవ్యాంతపూజలు, వాస్తు పూజ, నిత్యహోమాలు, విఘ్నేశ్వరపూజలు, స్వస్తివాచనం, సాయంత్రం యాగశాల మండప పూజలు, నీరాజన మంత్రపుష్పం, ఎదుర్కోళ్ల మహోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కాగా శుక్రవారం ఉదయం 10:30 గంటలకు రేణుకాఎల్లమ్మఅమ్మవారు,జమదగ్నిమహామునిల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సబిత దంపతులు హాజరై పట్టువస్త్రాలు, తలంబ్రాలను ప్రభుత్వం తరఫున అందజేయనున్నారు. కల్యాణానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద తగు ఏర్పాట్లను పూర్తి చేశారు. కల్యాణంతరం భక్తులకు ఆలయ కమిటీ తరఫున అన్నదానం ఏర్పాటుచేశారు. ఇదిలావుంటే అమ్మవారి కల్యాణానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య కోరారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్లు చంద్రయ్య, నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, రాజయ్య, నాగరాజు, సిబ్బంది శ్రీకర్, రాజు, ధర్మకర్తలు నగేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, శంకర్‌రెడ్డి, రాజు, రమేష్, వెంకన్న, బాబు, సైదులు, దుర్గమ్మ, రమేష్, ప్రభాకర్, ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమారాచార్యులు, అర్చకులు ఉమామహేశ్వరరావు, దామోదర్‌రావు, శ్రీనివాస్‌చారి, ఫణికుమార్‌చార్యులు పాల్గొన్నారు.



హైలాన్‌కాలనీలోని పాత బీఈడీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఇతర అధికారులు

బీసీ డిగ్రీ గురుకుల కళాశాల తరలింపు యోచన

నాగార్జునసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైలాన్‌కాలనీలోని పాతబీఈడీ కళాశాల భవనంలోకి హిల్‌కాలనీలోని గురుకుల బీసీ డిగ్రీ కళాశాలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తెలిపారు. గురువారం పాతబీఈడీ కళాశాల భవనాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బీసీ గురుకుల పాఠశాల, కళాశాల, డిగ్రీ కళాశాల ఒకే చోట నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలను హైలాన్‌కాలనీలో ఖాళీగా ఉన్న పాతబీఈడీ కళాశాల భవనంలోకి తరలించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే గతంలో బీసీ గురుకుల పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి ఏర్పాటుతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలను ఎంపీ రఘువీర్‌రెడ్డితో పాటు తాను సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఆ మేరకు త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బీసీ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ రవికుమార్, మాధవీలత, నాయకులు జంగయ్య, ఉంగరాల శ్రీను, పగడాల నాగరాజు, వేణు, హబీబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య: టీఎస్‌యూటీఎఫ్



చింతపల్లి ర్యాలీలో ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు

చింతపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొట్ల యాదగిరి తెలిపారు. గురువారం చింతపల్లిలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ఊరు-మన బడి ప్రచారజాతను ప్యాక్స్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య ప్రారంభించారు. చింతపల్లి, వింజమూరు, కుర్మపల్లి, తక్కళ్లపల్లి, గొల్లపల్లి, చాకిలిశేరుపల్లి, ఉమ్మాపురం, పోలేపల్లిరాంనగర్, గొడకొండ్ల, వెంకటేశ్వరనగర్(మాల్)తో పాటు పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ, సామాజిక కార్యకర్త వారాల రామచంద్రం, జిల్లా సభ్యుడు గనిమల్ల శ్రీరాములు, మండల ప్రధానకార్యదర్శి ముసుగు ఆనంద్ బాబు, మండల ఉపాధ్యక్షుడు బుడిగపాక వెంకటేశం, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాసవి పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నల్లగొండలో అవగాహన ర్యాలీ

నల్లగొండ, మిర్యాలగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వనాలను పెంచితే ప్రజలకు హితాన్ని కలుగజేస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఎన్నెస్పీ క్యాంప్‌లో పూలే భవన్, అంబేడ్కర్ భవన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోల్పోతే కాలచక్రంలో పెనుమార్పులు చోటుచేసుకుంటాయన్నారు. అతివృష్టి అనావృష్టి పరిస్థితులు నెలకొంటాయన్నారు. మిర్యాలగూడలో జనసాంద్రత అధికంగా ఉన్నందున ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్నారు. పరిశ్రమలు అధికంగా ఉండటంతో వాటి ద్వారా వెలువడే వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతినకుండా మొక్కలు పెద్దసంఖ్యలో నాటాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నల్లగొండ పట్టణంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు.

క్రైం పాయింట్
Crime point


ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

ట్రాక్టర్ పల్టీ.. రైతు మృతి

గరిడేపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టి రైతు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని సర్వారం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సర్వారం గ్రామానికి చెందిన కర్నాటి ఉపేందర్‌రెడ్డి(35) తన పొలంలో దుక్కిదున్ని సాయంత్రం ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా డొంక రోడ్డు ఎత్తుగా ఉండడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న ఉపేందర్‌రెడ్డిపై ఇంజన్ మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉపేందర్‌రెడ్డికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

నేరేడుచర్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని పాత నేరేడుచర్లలో తాటిచెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బొమ్మగాని వెంకన్న(65) కల్లు తీయడానికి గురువారం ఉదయం తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే వెంకన్నను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పట్టపగలే గేదెల అపహరణ

సూర్యాపేటరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామంలో పట్ట పగలే గుర్తుతెలియని వ్యక్తులను గేదెలను తొలుకెళ్లారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బాలెంల గ్రామానికి చెందిన పేర్ల వీరయ్య తన మూడు గేదెలను బుధవారం తన వ్యవసాయ క్షేత్రంలో మేతకు తీసుకెళ్లాడు. గమనించిన దుండగులు మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గేదెలను తోలుకెళ్లారు. గేదెలు సాయంత్రం ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. కన్పించకపోవడంతో మెయిన్‌రోడ్డుపై ఉన్న ఓ రైస్‌మిల్లులో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా నలుగురు వ్యక్తులు కలిసి గేదెలను తోలుకెళ్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. గేదెల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

లారీపై నుంచి పడి హమాలీకి గాయాలు

వలిగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లారీపై నుంచి కింద పడి హమాలీకి గాయాలయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన మొగిలిపాక కిష్టయ్య హమాలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో బార్దన్ కట్టల లారీ లోడ్ వచ్చింది. కిష్టయ్య లారీ పైకి ఎక్కి బార్దన్‌లు దింపుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయలు కావడంతో చికిత్స నిమత్తం భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరారాబాద్‌కు తరలించారు.

దొండ తోట పందిరి దగ్ధం


దగ్ధమవుతున్న దొండ పందిరి పంట

పెద్దవూర, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దొండ తోట పందిరి దగ్ధమైంది ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో గురువారం జరిగింది. బాధిత రైతు కోట అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఒక ఎకరంలో దొండ పందిరి వేయగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తి కాలపోయిందని తెలిపారు. స్థానిక రైతులు చూసి తనకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని రైతుల సహాయంతో మంటలను ఆర్పివేయగా అప్పటికే పంటతోపాటు డ్రిప్‌లు, పైపులైన్లు, పందిరి కడ్డీలు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

అడ్డగూడూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో గురువారం విద్యుదాఘాతంలో ఎద్దు మృతిచెందింది. బాధిత రైతు దేశబోయిన శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం... తన చేనులో గుంటక తోలి రోజు మాదిరిగా పశువులను మేపుతుండగా అక్కడున్న ట్రాన్స్‌పార్మర్ తగిలి విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిందింది. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా శిక్ష



సూర్యాపేటక్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో గురువారం పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తు ఐదుగురు పట్టుబడ్డారు. పట్టుబడినవారిని కోర్టులో హాజరుపరుచగా వారిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ. సాయిరాం తెలిపారు. మిగితా నలుగురికి కలిపి రూ. 5వేలు జరిమానా విధించారని తెలిపారు.

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల రిజర్వాయిర్ చెక్‌పోస్టు సమీపంలో హైవేపై ఎస్ఐ రాంమూర్తి గురువారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించిన వాహనాలు నడుపుతున్న 11 మందిని గుర్తించి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ సైదయ్య, శ్రీనివాస్, యాదయ్య, పాల్గొన్నారు.

150 పశువుల పట్టివేత

బీబీనగర్, జూన్5(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా రెండు వాహనాల్లో పశువులను కబేళాకు తరలిస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహిస్తున్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్‌లోని బహదూర్‌పూర్‌కు హెచ్‌ఆర్ 45బీ 2973, ఏపీ 29 డబ్ల్యూ1643 నెంబర్ గల లారీల్లో పశువులను తరలిస్తున్నారు. అనుమానం వచ్చి లారీలను తనిఖీ చేశారు. రెండు లారీల్లో 150పశువులను కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించి పశువులను స్వాధీనం చేసుకున్నారు. పశువులను రాజాపేట మండలం చల్లూరులోని గోశాలకు తరలించి, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు


పల్టీ కొట్టిన కారు


నుజ్జునుజ్జయిన బైక్

శాలిగౌరారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అర్వపల్లి నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని హైదరాబాద్ నుంచి పెర్కకొండారం మీదుగా అర్వపల్లి వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు పల్టీ కొట్టగా, బైక్ నుజ్జునుజ్జయింది. బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని శాలిగౌరారం ఎస్ఐ సైదులు తెలిపారు.

ప్రమాదమా.. అనుమానాస్పదమా?

● మారెడ్డి శిల్ప మృతిపై అనేక సందేహాలు ● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు ● కొనసాగుతున్న విచారణ


నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న శిల్ప కుటుంబసభ్యులు(ఫైల్)


మారెడ్డి శిల్ప(ఫైల్)

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని పానగల్లు ఉదయ సముద్రం ప్రాంతంలో కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మారెడ్డి శిల్ప(35) మృతిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 22వ తేదీన సాయంత్రం పానగల్లులో రోడ్డు వెంట శిల్ప వాకింగ్ చేస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇటీవల ఆమె మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. 2024 సంవత్సరం డిసెంబరులో శిల్ప తన భర్తతో విభేదాల కారణంగా ఆమె జిల్లాకేంద్రంలోని ఓ పోలీస్ అధికారిని ఆశ్రయించింది. ఆ సమయంలో సదరు పోలీస్ అధికారి ఆ మహిళా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆమెను ట్రాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇద్దరి మధ్య సెల్‌ఫోన్ చాటింగ్ కూడా జరగడం, అందులో వారి మధ్య సాన్నిహిత్యం ఏ స్థాయికి వెళ్లిందనేది సోషల్ మీడియా ద్వారా బయటకు వచ్చింది. శిల్ప భర్తపై కేసు పెట్టిన సమయంలో సదరు పోలీస్ అధికారి ఇదే అదనుగా ఆ వ్యక్తిపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు ఆమెతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. కొన్నాళ్లుగా గుట్టుగా చాటింగ్ జరుగుతున్న విషయాన్ని శిల్ప భర్త గమనించి అప్పట్లో జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఆ పోలీస్ అధికారిపై బదిలీ వేటు వేసి, ఐజీ కార్యాలయానికి అటాచ్ కూడా చేశారు. ఆ విషయం సదుమణిగిందనుకున్న సమయంలో శిల్ప అనుమానాస్పద మృతితో ఆ పోలీస్ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీసింది. బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలైనప్పుడు 108 వాహనానికి ఫోన్ చేసింది ఎవరు.. ఆ సమయంలో ప్రమాదాన్ని ఎవరైనా చూశారా అనేది తేలాల్సి ఉంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది.

కుటుంబ సభ్యుల ఆందోళనతో చర్చ

శిల్ప మృతిచెందడంతో గత ఆదివారం ఆమె కుటుంబ సభ్యులు రాత్రి నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తన కూతురు మరణానికి కారణమైన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని శిల్ప తల్లి పద్మ డిమాండ్ చేసింది. ఆ పోలీస్ అధికారే గత నెల 22న తన కూతురికి ఫోన్ చేసి పానగల్లులోని ఛాయ సోమేశ్వరాలయానికి రావాలని కోరడంతో ఆమె వెళ్లిందని తల్లి పేర్కొన్నారు. తన కూతురికి అన్యాయం చేసిన సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. న్యాయం చేస్తామని సీఐ రాఘవరావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించిన విషయం తెలిసిందే. గాంధీనగర్‌లో నివాసముంటున్న మారెడ్డి శిల్ప 22 తేదీ సాయంత్రం పానగల్లు ప్రాంతానికి వాకింగ్‌కు వెళ్లడం ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా అందింది. ఆమె అనుమానాస్పద మృతిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. శిల్ప మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె భర్త మారెడ్డి ప్రశాంత్‌రెడ్డి, శిల్ప తల్లి పద్మతో కలిసి బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. రోడ్డు ప్రమాదంలో కిందపడిన శిల్ప వెంటనే కోమాలోకి వెళ్లడంతో వాస్తవాలు తెలియకుండా పోయాయని సమాచారం. ద్విచక్ర వాహనం ఢీకొట్టిందని స్థానిక పోలీసులు పేర్కొంటున్నారు. ఇందులో వాస్తవాలు అన్ని వెలుగులోకి తీయాలని కుటుంబ సభ్యులు కోరారు. శిల్ప మృతి వెనక ఓ అధికారి పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేస్తున్నామని నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఏఎస్‌డబ్ల్యూవో తారాబాయిపై ఫిర్యాదు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్, తెలంగాణ క్లాస్-4 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం(జూన్ 2న) రోజు యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ సంక్షేమశాఖ ఉన్నత ఉద్యోగి ఒకరు 4వ తరగతి ఉద్యోగిపై దుర్భాషలాడుతూ దాడి చేసిన ఘటనపై తెలంగాణ రెవెనూ అసోసియేషన్, తెలంగాణ క్లాస్-4 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడు క్రిష్ణ విలేకరులతో మాట్లాడుతూ జూన్ 2న ఆవిర్భావ వేడుకల సభ అనంతరం లిఫ్ట్ వద్ద తనకు విధులు కేటాయించడంతో అక్కడికి వచ్చిన ఏఎస్‌డబ్ల్యువో తారాబాయి పైకి వెళ్తానని చెప్పారని, అందుకు తాను మెట్ల మార్గంలో వెళ్లాలని కోరానని తెలిపారు. దీతో ఆమె తనను తీవ్ర పదజాలంతో దూషిస్తూ ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయం వరకు తన కాలర్ పట్టుకొని లాక్కెళ్లారని ఆరోపించారు. అక్కడ సిబ్బంది అందరూ చూస్తుండగానే తాడుతో చేతులు కట్టేసి చెప్పులతో పలుమార్లు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అకారణంగా దూషించి దాడి చేసిన తారాబాయిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 4వ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కే. సురేష్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆఫీస్ సబార్డినేట్ క్రిష్ణపై దాడి చేయడం హేయనీయమని అన్నారు. చిన్నతరగతి ఉద్యోగి పట్ల రామన్నపేట ఏఎస్‌డబ్ల్యూవో తారాబాయి చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి జరిగిన మరుసటి రోజు రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, సీఎం పర్యటన అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరామని చెప్పారు. తారాబాయిపై చర్యలు తీసుకునేవరకు 4వ తరగతి ఉద్యోగుల తరుపున ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఫిర్యాదు చేసినవారిలో నాగు చెంద్రయ్య, మేడబోయిన సుదర్శన్, గజం నర్సింహ, రమేష్, కే. గిరి, కిరణ్, రమేష్ ఉన్నారు.

దాడి చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి రూరల్: అటెండర్‌పై చేయి చేసుకున్న మహిళా అధికారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండం వెంకట్ రెడ్డి, బి పల్లవి, తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. భువనగిరిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా కలెక్టరేట్ కార్యాలయ లిఫ్టు వద్ద విధులు నిర్వహిస్తున్న అటెండర్ మెరుగు కృష్ణపై మహిళా అధికారి అకారణంగా చేయి చేసుకోవడం సరికాదన్నారు. విచారణ జరిపి ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

కనుగుడ్డుకు గాయం.. అరుదైన చికిత్స

● విలవిలలాడుతున్న శునకాన్ని కాపాడిన కోదాడ ప్రాంతీయ పశువైద్యులు

కోదాడ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కనుగుడ్డుకు గాయంతో చూపులేక విలవిలలాడుతున్న ఓ పెంపుడు కుక్కకు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో గురువారం శస్త్ర చికిత్స నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన ఓ పెంపుడు కుక్కకు ప్రమాదవశాత్తు తలకు దెబ్బతగలడంతో ఎడమ కన్నుగుడ్డు కండరాలతో సహా బయటికి వచ్చింది. ఆ కుక్కను పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య పరీక్షించారు. కుక్క కనుగుడ్డుకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలతో శస్త్ర చికిత్స నిర్వహించారు. కనుగుడ్డును తిరిగి యథాస్థితిలోకి ఉంచి కుక్కకు అంధత్వం రాకుండా కాపాడారు. ఈ ఆపరేషన్‌లో కాపుగల్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సురేందర్, సిబ్బంది రాజు, అఖిల్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం



ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారు, గ్రామ బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారు, బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. వీర్లపాలెం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామన్నపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో గురువారం ఏర్పాటు చేసి జిల్లాస్థాయి కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడారు. నందనంలో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ.8కోట్ల బడ్జెట్ కేటాయించారని, భవనం నిర్మాణం పూర్తై పరికరాలు బిగించినా ప్రారంభించకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయని వ్యక్తం చేశారు. తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఐదు ఎకరాల భూమికి బోరు, మోటార్‌కు నిధులు కేటాయించి, నీటి వసతి కల్పించాలని గీత కార్మికులందరికీ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేసి రూ.4వేలు పెన్షన్ అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు రాగిరి కృష్ణయ్య, భవండ్లపల్లి బాలరాజు, బత్తుల లక్ష్మయ్య, అంతటి అశోక్, మారగోని అశోక్, అబ్బగోని బిక్షం, ఎర్ర రవీందర్, కూనూరు మల్లేశం పాల్గొన్నారు.

సాగర్ కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేత


నాగార్జునసాగర్ కుడికాల్వ

నాగార్జునసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కుడికాల్వకు బుధవారం రాత్రి నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. సాగర్ కుడికాల్వ పరిధిలో ఉన్న గ్రామాలకు తాగునీటి కోసం నీటిని విడుదల చేయాలని ఏపీ రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు ఈ ఏడాది మే 20వ తేదీన లేఖ రాశారు. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ కుడి కాల్వకు నాలుగు టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించింది. కుడి కాల్వకు కేటాయించిన నీటి వాటాను గత మే నెల 22వ తేదీ నుంచి రోజుకు సుమారు 4500 క్యూసెక్కుల చొప్పున 14 రోజుల్లో నాలుగు టీఎంసీలను విడుదల చేశారు. కుడికాల్వకు కేటాయించిన నీటి వాటా పూర్తవడంతో బుధవారం రాత్రి నుంచి నీటి విడుదలను నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 511.60 అడుగులుగా(134.4032 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీ ద్వారా జంటనగరాల తాగు నీటి అవసరాలకు 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి, ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు. సాగర్ నుంచి 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి నీటి రాక లేదు.

సాగర్ 13 క్రస్ట్ గేట్లకు మరమ్మతులు పూర్తి

వారం రోజులుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 26 క్రస్ట్ గేట్లు ఉండగా అందులో 1వ నెంబర్ గేటు నుంచి 13వ నంబర్ గేటు వరకు గ్రీసింగ్, రబ్బరు సీళ్ల, రోప్‌ల తుప్పును తొలగించడం వంటి పనులు పూర్తయయ్యాని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 13గేట్లకు సెంట్రల్ డ్రైవ్ యూనిట్‌లకు, ఎండ్ డ్రైవ్ యూనిట్లను సర్వీసింగ్ చేసి గ్రీసింగ్ చేశామని అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో మిగిలిన 13క్రస్ట్ గేట్ల మరమ్మతులు, సర్వీసింగ్ పనులు కూడా పూర్తి చేస్తామని, అన్ని క్రస్ట్ గేట్ల మరమ్మతులు, సర్వీసింగ్ పూర్తయిన తర్వాత వచ్చే వారంలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. సాగర్‌కు వరద రాక మొదలయ్యే నాటికి క్రస్ట్ గేట్లు ఎత్తడంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, క్రస్ట్ గేట్లు మోరాయించకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.


సాగర్ క్రస్ట్ గేట్లకు గ్రీసింగ్ చేస్తున్న సిబ్బంది

అభిమానం హద్దులు దాటొద్దు

ఆటలంటే, ఆటగాళ్లంటే అభిమానం ఉండాలి. కానీ ఆ అభిమానం హద్దులో ఉండాలని క్రీడారంగ నిపుణులు సూచిస్తున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)పై పిచ్చితో ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని ఆటను ఆటలాగే చూడాలని పేర్కొంటున్నారు. ఆటగాళ్లతో పాటు అభిమానులపై ఒత్తిడిని పెంచుతున్నాయంటున్నారు. ఐపీఎల్ అనగానే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ టౌన్)


ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు



క్రీడాభిమానులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఆటలంటే అభిమానం పెంచుకోవచ్చు. అయితే అభిమానాన్ని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే కదా. విజయోత్సవ సభ నిర్వాహకులు ఏర్పాట్లను మరింత పటిష్టంగా చేయడంతో పాటు ప్రేక్షకులకు నిర్ధిష్ట సూచనలు చేయకపోవడంతో తప్పిదం జరిగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

రామినేని భూలోకరావు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు.

చదువుకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి



ఆటలంటే అభిమానం ఉండాలి. అయితే అది హద్దులు దాటొద్దు. విద్యార్థుల తొలి ప్రాధాన్యత చదువే కావాలి, ఆ తరువాతే ఆటలు. సెలవు రోజున కాసేపు ప్రాక్టీసు చేయడం, మ్యాచ్ చూడటం వరకూ ఒకే. కానీ అదే పనిగా ఉండొద్దు. ఆర్సీబీ విజయోత్సవ సభలో క్రికెట్ అభిమానులు మృత్యువాతపడటం బాధాకరం. అయితే అభిమానుల పట్ల క్రికెటర్ విరాట్ కోహ్లీ స్పందించిన తీరు బాగుంది.

కేఎస్ఎన్ రాజు, రిటైర్డ్ సీనియర్ ఫిజికల్ డైరెక్టర్.

ప్రైవేట్ వరి విత్తనాల పాగా



- సాగర్ ఆయకట్టులో 90శాతం అవే సాగు
- దిగుబడులు రాక నష్టాలు వచ్చినా అదే బాట
- సంప్రదాయ వంగడాలకు స్వస్తి
- ఇదీ సాగర్ ఆయకట్టు దుస్థితి

నాగార్జునసాగర్ ఆయకట్టులో ఏడు దశాబ్దాలుగా వరి సాగు చేస్తున్నారు. సంప్రదాయ వరి రకాలు సాగుచేస్తూ అన్నదాతలు ఆర్థిక పుష్టి సాధించారు. ఈ మధ్యకాలంలో లాభ నష్టాలతో సంబంధం లేకుండా మార్కెట్‌ను అనుసరించి రకాలు ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి. ఒకప్పుడు వానాకాలంలో సాంబమసూరి (బీపీటీ-5204), యాసంగి ఎంటీయూ-1010 రకాలు అత్యధికంగా సాగు చేసేవారు. ఐదేళ్లుగా రక రకాల అతిసన్నని ప్రైవేట్ రకాలు మార్కెట్లోకి వచ్చాయి. వీటి సాగుపై ప్రారంభంలో రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. చాలా తక్కువ విస్తీర్ణంలో ఈ రకాలు సాగు చేసేవారు. ప్రైవేట్ రకాల బియ్యం సాంబమసూరి కన్నా చాలా సన్నగా ఉండడంతో మార్కెట్లో విపరీతమైన డిమాండ్ పెరిగింది.

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ, వ్యవసాయం)



నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో జూన్‌లో నారు పోసుకుని జూలైలో వరినాటు వేసుకునే రైతులకు కొంత మేర ప్రైవేట్ రకాల సాగు కొంత గిట్టుబాటు అవుతుంది. సాగర్ జలాశయానికి వరద చాలా ఆలస్యంగా వస్తుండడంతో కాల్వ ఆధారంగా పంట సాగు చేసుకునే రైతులు ఆగస్టు నుంచి సెప్టెంబరు వరకు వరినాట్లు వేసుకుంటున్నారు. పంటల సాగులో ఆలస్యం కారణంగా వర్షాలు, చలి ప్రభావంతో పంట తెగుళ్ల బారిన పడుతుంది. ఈ రకాలు చాలా మృదువుగా ఉండడంతో వాతావరణ మార్పులను తట్టుకోలేక పోతున్నాయి. పెట్టుబడులు ఎకరానికి రూ.35-40వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఆశించిన మేరకు కుదుళ్లు రాకపోవడంతో పంట చేతికొచ్చే సమయయంలో(నవంబరు- డిసెంబరు) చిన్న పాటి గాలి వర్షానికి పంట పడిపోతుంది. పండిన పంట చేతికొచ్చేది కష్టంగా మారుతుంది. గత ఖరీఫ్‌లో పంట కోత సమయంలో కురిసిన వర్షానికి గింజ నల్లగా మారిపోయి దిగుబడులు కనీసం 20బస్తాలు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుట్ట గొడుగుల్లా..

ఐదేళ్ల క్రితం ఒకటి రెండు రకాల మినహా ప్రైవేట్ వంగడాలు మార్కెట్లోకి రాలేదు. సాగు విస్తీర్ణం భారీగా పెరగడంతో పాటు విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ మధ్య కాలంలో వందలాది రకాల వంగడాలు మార్కెట్‌ను ముంచెత్తాయి. మహారాష్ట్రకు చెందిన కంపెనీలు అత్యధికంగా ఉన్నాయి. చాలా రకాలు సరైన జన్యు స్వచ్ఛత లేకుండానే మార్కెట్‌లోకి వదలడంతో రైతులు సాగు చేసి నష్టపోతున్నారు. చాలా ప్రాంతాల్లో గింజ పరిమాణంలో తేడా రావడంతో మార్కెట్లో కొనుగోలు చేయకపోవడంతో క్వింటాకు రూ.1800లకు విక్రయించారు. మార్కెటో వందలాది కంపెనీలు, వినూత్న పేర్లు, అందమైన ప్యాకిం గ్‌ల్తో ఆకట్టుకునే విధంగా ప్రచార చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విత్తనాలు విక్రయించడమే కాని తర్వాత పంటలో వచ్చే నష్టాలకు కంపెనీ యాజమాన్యం జవాబుదారీ తనం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ రకాలను పది కిలోల సంచికి రూ. 900ల వరకు విక్రయిస్తున్నారు. ఎకరా సాగుకు సుమారు 15కిలోల వరకు విత్తనం పడుతుం డడంతో రూ.1350 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే సాంబమసూరి అయితే ఎకరానికి 25 కిలోల విత్తనానికి కేవలం రూ.1100లు ఖర్చవుతుంది.

ప్రభుత్వ విత్తనాలకు ఆదరణ కరువు

రాష్ట్రంలో వ్యవసాయ యూనివర్సిటీ విడుదల చేసిన వివిధ రకాల వరి వంగడాలకు రైతుల్లో ఆదరణ కరువైంది. ఇప్పటికీ 1980లో సాంబమసూరి, ఎంటీయూ-1010 రకాలు మినహా ఆయకట్టులలో ఇతర ఏ రకాలు సాగులో లేవు. విత్తనాల ధరలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. వానాకాలం, యాసం గిలో నూ ఎకరానికి 45-50బస్తాలు దిగుబడులు వస్తున్నాయి. పంట కోత కాగానే ధాన్యం (17శాతం) తేమ వచ్చేవరకు ఆరబెట్టాల్సి రావడంతో రైతులు ఈ రకాలపై ఆ సక్తి చూపడం లేదు. ప్రైవేట్ రకాలు పంట కోత పూర్తికాగానే పచ్చి ధాన్యం నేరుగా మిల్లుకు తరలించే విధంగా ఉండడంతో రైతులు ఈ రకాలు సాగు చేస్తున్నారు.

యాసంగిలో అంతే..

దశాబ్దాలుగా యాసంగిలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే దొడ్డు రకాలు మాత్రమే సాగు చేసేవారు. ప్రస్తుతం విరివిగా ప్రైవేట్ రకాలను సాగు చేస్తున్నారు. ఈ రకాలు పూర్తిస్థాయిలో ఉష్ణోగ్రతలను తట్టుకోవడం లేదు. గింజ తాలు పోవడంతో దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. సాగర్ ఆయకట్టులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా 90శాతం మేర ప్రైవేట్ సన్న రకాలు సాగు చేస్తున్నారు. ఈ పంటల సాగు గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు.

ప్రైవేట్ రకాలతో నష్టాలే



ప్రైవేట్ వరి వంగడాల సాగుతో చాలా నష్టపోతున్నాం, వాతావరణ మార్పులు ఏ మాత్రం తట్టుకోలేవు.తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఎక్కువ పర్యాయాలు మందులు పిచికారి చేయాల్సి వస్తుంది. పంట కోతలు అపుడు వర్షం పడితే పంట అంతా పడిపోయి గింజ చేతికి రావడం లేదు. పెట్టుబడులు ఎకరానికి 35-40వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. దిగుబడులు 30 బస్తాలు మించి రావడం లేదు.. మిగులు బాటు ఉండటం లేదు. మిల్లర్లు ఈ రకాలను కొనుగోలు చేస్తుండటంతో తప్పని పరిస్థితిలో సాగు చేస్తున్నాం.

అనుముల చలపతిరెడ్డి, రైతు, త్రిపురారం,

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	134.4032
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.10 అడుగులు
టీఎంసీలు	3.24
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	357. 40క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	76.40 క్యూసెక్కులు

శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి శేషవస్త్రాలు అశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు జాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. వివిధ విభాగాల ద్వారా రూ.30,04,841 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

అసమానతలు లేని సమాజం కోసం పనిచేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని సమాజం కోసం ఎమ్మార్పీఎస్ తన ఉద్యమ ప్రయాణాన్ని కొనసాగి స్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యవర్గ జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతవుల కోసం పోరాడి పింఛన్ సాధించామని గుర్తుచేశారు. సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందన్నారు. మాదిగల కోసం 30ఏళ్లకు పైగా జరిగిన రాజీలేని పోరాటం విజయవంతమై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 31వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నా యకులు రాష్ట్ర, జిల్లా సుధాకర్ మాదిగ, జానకి రామయ్య, మల్లేపాక వెంకన్న, గాదే రమేష్, ఇరిగి శ్రీశైలం, కమలమ్మ, మేడి శంకర్, పెరిక శ్రీనివాసులు, రవీందర్, చిన్న, దేవయ్య, వెంకన్న, ఏడుకొండల్, ప్రసాద్, సైదులు, గిరి, రాజు పాల్గొన్నారు.

నాణ్యమైన మానవ వనరులు అందించాలి

మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమశాఖ కళాశాలలు నైపుణ్యం గల మానవ వనరులను అందించాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో జరిగిన సాంఘీక సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్‌ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు తగిన గురుకులాలు ఉన్నత అవకాశాలు కల్పించే విధంగా కళాశాలలు తీర్చిదిద్దాలన్నారు. అనంతరం కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య, రిజల్ట్, విద్యార్థుల భవిష్యత్తు, కళాశాలలో నిర్వహించే కార్యక్రమాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. అడిట్ సెల్ డాక్టర్ వై. ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట, దేవరకొండ, నాగార్జునసాగర్, భువనగిరి ప్రాంతాల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు ఉండటంతో ఇప్పటికే తక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల్లో కనీస ప్రవేశాల కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాటలో శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గతంతో పోలిస్తే మెరుగైన వసతులు, అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, ప్రయాణ చార్జీలు, డిజిటల్ తరగతులు తదితర అవకాశాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉండటంతో విద్యార్థుల చేరికలు అధికంగానే ఉంటాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల ప్రవేశాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3,210 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలన్నింటిలో విద్యార్థుల ప్రవేశాలు తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇందుకు కొంతకాలంగా పెరిగిన జనాభా నియంత్రణ, వలసలు కారణమని అధికారులు విశ్లేషిస్తున్నప్పటికీ బడి ఈడు పిల్లలు ఇప్పటికే బడికి దూరంగా ఉండటమే కారణమని సామాజిక, పిల్లల హక్కుల కార్యకర్తలు అంటున్నారు. గత మూడేళ్లతో పోలిస్తే జిల్లాలో 912 పాఠశాలల్లో 11,406 మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. అలాగే ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా తగ్గుతోంది. అయితే ప్రభుత్వ యాజమాన్య సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు మందగిస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.

బడిబాట షెడ్యూల్ ఇలా..

- 6న గ్రామసభ నిర్వహణ
- 7న ప్రతీ ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలి.
- 8, 9, 10న కరపత్రాలతో ఇంటింటా ప్రచారం, ర్యాలీలు, డ్రాపౌడ్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం. ప్రత్యేకావసరాలున్న పిల్లలను గుర్తించి సమీపంలోని భవిత కేంద్రాల్లో చేర్పించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడి ఈడు పిల్లలను గుర్తించాలి.
- 11న బడిబాట ప్రారంభమైన 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష.
- 12న పాఠశాలల పునఃప్రారంభం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రారంభించాలి. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ.
- 13న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, బాలలసభ.
- 16న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్) దినోత్సవం నిర్వహించాలి.
- 17న విలీన విద్య, బాలిక విద్య నిర్వహించాలి.
- 18న తల్లిదండ్రులను, గ్రామస్థులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలీకరణ, ఇతర ఆధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించి హరితహారం నిర్వహించాలి.
- 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాలి.

బడిబాటను విజయవంతం చేయాలి

నేటి నుంచి ప్రారంభంకానున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను విజయవంతం చేయాలి. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా బడిబాటలో పాల్గొన్నాలి. బడిఈడు పిల్లలనందరినీ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు నాణ్యమైన విద్యబోధన, సౌకర్యాలు లభిస్తాయి. రుచికరమైన మధ్యాహ్న భోజనం ఉంటుంది. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల ఆర్భాటపు ప్రచారానికి మోసపోవద్దు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు సహకరించాలి.

● కె.సత్యనారాయణ, డీఈవో, యాదాద్రి భువనగిరి

అందరి సహకారంతో బడిబాట

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు విజయవంతం చేయాలి. ఆయా గ్రామాల్లో ప్రతీ ఒక్కరి సహకారం తీసుకొని బడిఈడు పిల్లలను బడిలో చేర్చేలా కృషి చేయాలి. నిర్ణయించిన తేదీల ప్రకారం బడిబాట కార్యక్రమాలను చేపట్టాలి. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలి.

● బొల్లారం భిక్షపతి, డీఈవో నల్లగొండ

అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



తిర్మలాపూర్‌లో సీఎం సభా ఏర్పాట్లపై మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య, పక్కన ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

తుర్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ఆలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేస్తారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో నిర్వహించే సభా ఏర్పాట్లను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం, రాష్ట్ర నలుమూలల నుంచి యాదగిరి దేవస్థానానికి వచ్చే భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు రూ.100కోట్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు 30 ఏళ్లగా ఎదురు చూస్తున్న గంధమల్ల చెరువును రూ.700 కోట్లతో రిజర్వాయర్‌గా మార్చేందుకు సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా 15 మండలాల్లో సుమారు వంద ఎకరాలకు గ్రావిటీ ద్వారా గోదావరి జలాలతో సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధిక సంఖ్యలో ఉన్నందున రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారని, తద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందనుందన్నారు. అదే విధంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతంలో రూ.183కోట్లతో నిర్మించే మెడికల్ కళాశాల,మోటకొండూరు మండలంలో నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ సందర్భంగా 100 ఎకరాల్లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ బహిరంగ సభను 50వేల నుంచి 60వేల మందితో నిర్వహిస్తామన్నారు. 600 బస్సులు, 600 డీసీఎంలు ద్వారా ప్రజలు రానున్నారని తెలిపారు. ఈ సభకు ఆలేరు నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంధ్య, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూధన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ ఛైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్: సీఎం రేవంత్ రెడ్డి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం బీబీనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు..

● యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో వేద పాఠశాల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయాల్సి ఉంది. అనివార్య కారణాలతో ఈ కార్యక్రమం వాయిదా పడినట్లు ఆలయ సివిల్ అధికారులు తెలిపారు.

పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: సీపీ

బీబీనగర్: సీఎం బహిరంగ సభ నేపథ్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు పోలీసు సిబ్బందికి సూచించారు. గురువారం బీబీ నగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు.

ఎన్నో ఆశలు

(5వ పేజీ తరువాయి)

4లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను పునరుద్ధరించాలి. అవుట్‌లెట్ వైపున టీబీఎం యంత్రం పనిచేయడానికి అవసరమైన బేరింగ్ ఇప్పటికే రాగా, మిగిలిన పరికరాలను తెప్పించడానికి అవసరమైన నిధులు మంజూరుచేయాలి. టన్నెల్ కూలిపోయిన ఇన్‌లెట్ వైపు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో సొరంగం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- పెండ్లిపాకల ఎత్తుపెంపు, నక్కలగండి, పెండ్లిపాకల, డిండి రిజర్వాయర్ల భూసేకరణకు నిధులు కేటాయించాలి.
- డిండి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఏదుల-డిండి అనుసంధాన పథకానికి టెండర్లు ముగించి పనులు ప్రారంభించాలి.
- బ్రాహ్మణవెల్లంల పథకంలో కాల్వల తవ్వకానికి భూసేకరణ, పనుల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి.
- ఉమ్మడి జిల్లాలోఅసంపూర్తిగా ఉన్న దాదాపు 2,300డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేసి తక్షణం లబ్ధిదారులకు అందించాలి.
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతులకు ఆధునిక టెక్నాలజీతో చేపట్టాల్సిన పనులకు నిధులు మంజూరు చేయాలి.
- నెల్లికల్లు ఎత్తిపోతల పథకం మొదటి దశ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐడీసీ ఎత్తిపోతల పథకాల నిర్వహణను ఐడీసీ చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టాలి.
- మిర్యాలగూడ, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను తక్షణం పూర్తిచేసి, ఆయకట్టుకు నీరందించాలి.
- నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి (సాగర్) మండలంలో భూములకు పట్టాలిచ్చే కార్యక్రమం తక్షణం పూర్తిచేయాలి. ఎండింగ్ ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి.
- దేవరకొండలో 100 పడకల ఆస్పత్రిని 200గా అప్‌గ్రేడ్ చేయాలి.
- నల్లగొండలోని ఐటీ టవర్‌ను పునరుద్ధరించి కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకుని స్థానికులకు ఉపాధి కల్పించాలి. సూర్యాపేట ఐటీ టవర్‌లో కంపెనీలను ఏర్పాటు చేయాలి.
- నీలగిరి కళావేదిక నిర్మాణం చేపట్టేందుకు నిధులివ్వాలి.
- ఉమ్మడి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఆయకట్టు కలిగిన ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగానికాల్వ, ఆసిఫ్‌నహర్ తదితర మూసీ కాల్వల మరమ్మతులు తక్షణం పూర్తిచేయాలి.
- తుంగతుర్తిలోని రుద్రమ్మచెరువును రిజర్వాయర్‌గా మార్చాలి
- యాదగిరిగుట్ట విస్తరణ పనులు పూర్తిచేయాలి. యాత్రీకులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలి. ధర్మకర్తల మండలిని తక్షణం ఏర్పాటు చేయాలి.
- బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల వాసులకు, భూములు కోల్పోయినవారికి పరిహారం అందించాలి.
- భువనగిరి-చిట్యాల రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలి.
- మిర్యాలగూడ నియోజకవర్గంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు, అదేవిధంగా అటవీభూములు కోల్పోయిన గిరిజనులకు ఉద్యోగాలివ్వాలి.
- మిర్యాలగూడ-భీమారం-సూర్యాపేట రోడ్డును నాలుగులేన్ల రహదారిగా మార్చి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలి.
- సీతారామసాగర్ నుంచి పాలేరుకు గోదావరి జలాలు తీసుకురావడం ద్వారా అక్కడి నుంచి నడిగూడెం, మోతె మండలాలకు సాగునీరు ఇస్తామనే మంత్రుల హామీ మేరకు పనులు చేపట్టాలి
- మోత్కూరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలి.

సభకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)



పోలీస్ డాగ్‌ను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు,

350 మీటర్ల దూరంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటుచేశారు. సీపీ సుధీర్‌బాబు పర్యవేక్షణలో ఐదుగురు డీసీపీలు, 12 మంది అదనపు డీసీపీలు, 20 మంది ఏసీపీలు, 50 మంది సీఐలు, 150 మంది ఎస్ఐలు, 1500 మంది ట్రాఫిక్, సివిల్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలో బాంబ్, డ్యాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఏర్పాట్లను కలెక్టర్ హనుమంతరావు సమీక్షించారు.

తిర్మలాపూర్‌లో శంకు స్థాపన చేసే అభివృద్ధి పనులు ఇవే..

సీఎం రేవంత్‌రెడ్డి తిర్మలాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.700కోట్లతో 1.41టీఎంసీల సామర్థ్యం ఉన్న గంధమల్ల రిజర్వాయర్‌కు, రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, రూ.180కోట్లతో యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల. రూ.15కోట్లతో దాతర్‌పల్లిలో వేర్ హౌస్ గోదాములు, రూ.30కోట్లతో సీఆర్‌ఆర్, ఎంఆర్‌ఆర్ రోడ్లు, రూ.100కోట్లతో యాదగిరిగుట్టలో టెంపుల్ అభివృద్ధి పనులు, రూ.14.50కోట్లతో కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జీలు, రూ.50కోట్లతో నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు, మోటకొండూరు మండల కేంద్రంలో ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాలకు రూ.10కోట్లతో ఒకే చోట శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించనున్నారు. సీఎంతో పాటు సభకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, శాసన మండలి ఛైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు.

పార్కింగ్ స్థలాలు ఇలా

సభకు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ పోలీస్‌లు ప్రత్యేక స్థలాలను కేటాయించారు. పీ-1 ఆర్టీసీ బస్సుల్లో వచ్చే వారికి వయా తుర్కపల్లి, పీ-2 ప్రైవేట్ బస్సుల్లో వచ్చే వారికి వయా తుర్కపల్లి , పీ-9 కార్లు, బైక్‌లో వచ్చే వారికి వయా తుర్కపల్లి, పీ-4 గంధమల్ల, జగదేవ్‌పూర్ నుంచి వచ్చే అన్ని వాహనాలను ఇక్కడ పార్క్ చేయాలని ట్రాఫిక్ పోలీస్‌లు తెలిపారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం నియామకం

చిట్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చిట్యాల పట్టణ కార్యవర్గాన్ని గురువారం పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ముప్పా సుఖేందర్‌రెడ్డి, అమరోజు సునీత, వైరాల రాహుల్, భానుప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కందాటి చంద్రారెడ్డి, శ్రీను, కార్యదర్శులు బెల్లి నరేష్‌యాదవ్, నాలావత్ కృష్ణ, మురళీ యాదవ్, నల్లా మల్లారెడ్డి, బొక్క ధనుంజయ్‌రెడ్డి కోశాధికారిగా సురేందర్‌రెడ్డితో పాటు మరో ఆరుగురిని కార్యవర్గసభ్యులుగా నియమించారు.

ఆలయంలో మొక్క నాటిన ఉపాధ్యాయులు

చిట్యాలరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం నేరడలో శ్రీశాంభవిదేవి ఆలయంలో గురువారం చిట్యాలకు చెందిన ఉపాధ్యాయులు మొక్కను నాటారు. గ్రామంలోని దుకాణాల్లో పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని, వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పెద్ది నరేందర్, పెద్ది పద్మ, ఆనంద్‌కుమార్, షమీం ఉన్నీసాబేగం, జ్యోతి, మౌనిక, జుబీద, రమాదేవి, మాధవి, ఆసియా, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల మండలం పేరేపల్లిలో అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జి.కృష్ణ

మూడో రోజు కొనసాగిన రెవెన్యూ సదస్సులు

చిట్యాలరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు మూడవ రోజు గురువారం గ్రామాల్లో కొనసాగాయి. చిట్యాల మండలం పేరేపల్లి, ఉరుమడ్ల గ్రామాల్లో తహసీల్దార్ జి.కృష్ణ, నాయబ్ తహసీల్దార్ విజయ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. భూముల సమస్యలు ఉన్న యజమానులు, రైతులు, హక్కుదారులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అర్జీలు అందజేశారు. సాదాబైనామ, రెవెన్యూ రికార్డుల్లో భూమి తమ పేరిట నమోదు కాలేదని, ఉన్న భూమి విస్తీర్ణంలో తక్కువగా నమోదైనదని, పేర్లు మార్పిడి కాలేదని వీటితో పాటు పలు సమస్యలపై అర్జీలు అందజేయగా వాటికి రశీదులు ఇచ్చారు. పేరేపల్లిలో 61 అర్జీలు, ఉరుమడ్లలో 39 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.కృష్ణ, నాయబ్ తహసీల్దార్ విజయ మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సుల్లో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. వాటిని పరిశీలించి తాము పరిష్కరిస్తామని, తమ స్థాయిలో లేని వాటిని ఆర్డీవో, కలెక్టర్ పరిష్కరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సులను మండలంలోని గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేయర్ రజనీకాంత్, ఆర్ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్‌రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : డీఈవో



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఈవో భిక్షపతి అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా క్రీడల శాఖ, పలు కోచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో, డీఈవో మాట్లాడుతూ నెల రోజుల పాటు బాలబాలికలకు తైక్వాండో, కరాటే, ఫుట్‌బాల్, వాలీబాల్, యోగా వంటి క్రీడా అంశాల్లో తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో 500 మంది బాల బాలికలు పాల్గొని పలు ఆటల్లో నైపుణ్యాలు, మెళకువలు నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. అనంతరం శిక్షణ పొందిన బాలబాలికలకు సర్టిఫికెట్లను అందజేశారు. డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ విమల, కరాటే కోచ్‌లు నాగార్జున, నగేష్, శ్రీధర్, పవన్, శ్రీనివాసులు, సైదులు, తైక్వాండ్ కోచ్‌లు అంబటి ప్రణీత్, ప్రేమ్, లోకేష్, ఫుట్‌బాల్ కోచ్‌లు లింగయ్య, సునీత, దాస్, యోగా టీచర్ నాగార్జున, కోచ్ ప్రకాష్‌నారాయణ, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు కళా రంగంలో కూడా రాణించాలని డీఈవో భిక్షపతి అన్నారు. పట్టణంలోని బోయవాడ ప్రాథమిక పాఠశాలలో గురువారం నాగార్జునసాగర్ బాలభవన్, నల్లగొండ బాల కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెలరోజుల పాటు నేర్చుకున్న నైపుణ్యాలను తిరిగి వేదికలపై ప్రదర్శించాలని సూచించారు. అనంతరం బాలబాలికలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిక్షణ శిబిరంలో బాలబాలికలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ పాలబిందెల బాలు, ఉపేంద్రచారి, ఫజల్ బేగం, దివ్య, హెచ్ఎం అమ్జద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈవో భిక్షపతి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నల్లగొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, దానిని పరిరక్షించుకోవాలని పర్యావరణ ఇంజనీర్ ఎన్.వెంకన్న, శంకర్ బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో పర్యావరణ గ్రీన్ ర్యాలీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ ప రిరక్షణ ఆవశ్యకతను వివరించారు. తెలంగాణ కాలు ష్య నియంత్రణ మండలి అధికారులు, నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొని క్యాప్‌లు, బట్ట సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయక ఇంజనీర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి, డాక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



బట్ట సంచులు అందజేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

● శాలిగౌరారం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి అన్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎపీవో జంగమ్మ, ఈసీ వెంకటాచారి, టీఏ రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ బట్ట సైదులు, మల్టీపర్పస్ వర్కర్ నిమ్మల నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ కరుణ, ఏఎన్ఎం పద్మావతి, మయూరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క రూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య విజ్ఞప్తి చేశారు. పట్టణంటలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో హాస్పిటల్ డాక్టర్లతో కలిసి మొక్కను నాటి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద, నాయకులు కొండ మల్లేష్, రాము, ఏఎన్ఎం ధనమ్మ, అరుణ, యాదయ్య పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మొక్క నాటుతున్న ఎంపీడీవో జ్యోతిలక్ష్మి

మూత్ర పిండాల వ్యాధిగ్రస్థుడికి అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు చేతన్, వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికమైన మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ చావు దగ్గరికి వెళ్లిన రోగిని యశోద ఆసుపత్రి డాక్టర్లు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. యశోద ఆసుపత్రికు చెందిన డాక్టర్లు వీరమనేని చేతన్, డాక్టర్ బి.వెంకట్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 56 సంవత్సరాల వయసున్న జనార్దన్‌రెడ్డి అనే రోగి దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో మూత్రం రాక కడుపు ఉబ్బి, జ్వరం, శ్వాస సమస్యలు, కాళ్ల వాపుతో బాధపడుతున్నాడు. నల్లగొండ పట్టణంలోని ఆసుపత్రిలో చేరి చికిత్స పొందినా వ్యాధి నయం కాకపోవడంతో యశోద ఆసుపత్రిలో చేరినట్లు డాక్టర్లు తెలిపారు. వెంటనే తాము సకాలంలో రోగి స్థితిని గుర్తించి సరైన నిర్ణయాలు తీసుకొని, అరుదైన చికిత్స చేసి అతడిని కాపాడినట్లు తెలిపారు. అతనికి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కి కారణమైన గ్లో మేరీలో నెఫ్రాటిస్ వ్యాధి బయటపడిందని, వెంటనే తాము దానికి అనుగుణంగా చికిత్సను మార్చడం వల్ల రోగి ప్రాణాలను కాపాడటం సాధ్యమైనట్లు తెలిపారు. యశోద ఆసుపత్రి వైద్య నిపుణుల సమర్థవంతమైన చికిత్సకు స్పందించి రోగి మెల్లమెల్లగా కోలుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు రోగి పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి కోఆర్డినేటర్ ఏ. వాసు కిరణ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నూతన పింఛన్లు ఇవ్వాలి

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

మునుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెంచిన పింఛన్లను వెంటనే చెల్లించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. మునుగోడు ఎంపీడీవో కార్యాలయం గురువారం దివ్యాంగులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈదయ్య, బాబు, సుమతి, మత్స్యగిరి, అలివేలు, సహదేవ్, వెంకన్న, రేణుక, శ్రీకాంత్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హాకీ శిక్షణ ముగింపులో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్, నాయకులు

ముగిసిన హాకీ ఉచిత శిక్షణ శిబిరం

చిట్యాలరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలం ఉరుమడ్లలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో గత నెల 1 నుంచి నిర్వహిస్తున్న ఉచిత హాకీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ శిబిరంలో సుమారు 50 మంది క్రీడాకారులకు శిక్షణను ఇచ్చారు. క్రీడాకారులకు మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పల్లపు బుద్ధుడు క్రీడాకారులకు స్నాక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నవయసు నుండే క్రీడలపై దృష్టిని సారించాలని విద్యాబుద్ధులతో పాటుగా క్రీడలపై ఆసక్తిని కనబరిచిస్తే ప్రతి క్రీడల్లో ముందుండి రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో కోచ్ గంగపురం రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండ పరమేష్, ఎలుగు శేఖర్, సన్నపాల శ్రీను, చెరుకు సైదులు, బండ్ల నరేష్, సుంకరి శేఖర్, జనగాం స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మన పిల్లల్ని మన ఊరుబడిలో చేర్పించాలి



నేరడలో ప్రజారజాతలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిట్యాలరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పిల్లల విద్యాభ్యాసానికి ప్రభుత్వం పాఠశాలను నిర్మించిందని పిల్లల్ని తల్లిదండ్రులు మన ఊరు బడిలో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ చిట్యాల మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య కోరారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాత గురువారం చిట్యాల మండలం నేరడ, ఉరుమడ్ల, వనిపాకల, వట్టిమర్తి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పిల్లల కోసం ఆయా గ్రామాల్లోనే ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి పాఠశాల భవనాలను నిర్మించిందని ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రులు వారి పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లయితే పాఠశాలలు మనుగడను సాధిస్తాయన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రతి తల్లిదండ్రి ఆలోచించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఫీజుల భారాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో యాదయ్య, జానకి, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్ రామలింగయ్య, రఘు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తీగల సాగర్ డిమాండ్

నల్లగొండరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తీగల సాగర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న సీపీఎం నల్లగొండ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తీగల సాగర్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వెంటనే వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. సాగుకు అవసరమైన పచ్చిరొట్టె, జీలుగు, పెసర్లు ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న చివరి భూముల వరకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ చేయాలని కోరారు. అదేవిధంగా గత మూడు సీజన్‌లలో పెండింగ్‌లో ఉన్న రైతు భరోసాను ఈ సీజన్‌తో కలుపుకొని వెంటనే రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వెంటనే హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రిన్సిపాల్‌గా పాలడుగు నాగార్జున వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బీకార్ మల్లేష్, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

ప్రారంభమైన రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

● పూజల్లో పాల్గొన్న కంచర్ల కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి

● 8న కల్యాణానికి హాజరుకానున్న మాజీ మంత్రి కేటీఆర్

చిట్యాలరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో గల శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన కంచర్ల మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులైన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, మనువడు కంచర్ల సమరసింహారెడ్డి ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు, మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, అఖండదీపారాధన, రక్షాబంధనము, రుత్వికరణంతో పాటు ప్రదోశ పూజ, మూలమంత్ర జప హోమం, సహస్ర కుంకుమార్చన, నారాజన మంత్ర పుష్పంతో పాటు పలు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూ పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. 6వ తేదీన మండప పూజ, వేద పారాయణములతో పాటు పలు పూజలు, 7న బొడ్రాయి పూజతో పాటు నిత్య పూజలు, 8న నిత్య పూజలతో పాటుగా రేణుక ఎల్లమ్మ దేవతకు బోనాలు సమర్పించనున్నారు. సాయంకాలం శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కల్యాణానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు హాజరుకానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.



ఉరుమడ్లలో బ్రహ్మోత్సవాల పనులు పరిశీలిస్తున్న కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి దంపతులు

చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డుడజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్టం	37.5
కనిష్టం	24.6




ప్రైవేట్ వరి విత్తనాల పాగా

- వినూత్న పేర్లు, అందమైన ప్యాకింగ్‌లో రైతులను ఆకట్టుకునేలా ప్రచారం

7

సీఎం పర్యటనపై ఎన్నో ఆశలు!



- నేటి నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పర్యటనలు
- నేడు యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో నాలుగోసారి అధికారికంగా పర్యటన

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలేరు నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక మూసీ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఆ తర్వాత హుజూర్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తాననే సీఎం హామీ మేరకు తొలుత ఆలేరు నియోజకవర్గంలో శుక్రవారం సీఎం పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మకమైన గంధమల్ల రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయడంతో పాటు, తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ వద్ద ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం ఇక్కడే ఏర్పాటు చేయనున్న బహిరంగసభలో మాట్లాడుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. కీలకమైన పథకాలు, పనులకు సీఎం హామీ ఇస్తారని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వాసులు ఆశిస్తున్న పనులివే..

- యువతకు ఉపాధి కల్పన నిమిత్తం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, అనుముల, డిండి, హుజూర్‌నగర్, ఆలేరు, భువనగిరిలో నిర్మాణంలో ఉన్న ఏడు ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల)లలో పెండింగ్ పనులు పూర్తిచేసి ఈ విద్యాసంవత్సరం నుంచే వాటిని అందుబాటులోకి తేవాలి.
- ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట మినహా మిగిలిన 11 నియోజకవర్గాలకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులు తక్షణం ప్రారంభించాలి.
- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఉమ్మడి జిల్లాలోని మూడు ప్రాంతాలకు ఒక్కోటి చొప్పున కేటాయించాలి.
- కోదాడలో ఉమెన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి.
- అన్ని మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు, నియోజకవర్గ కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి.
- ఉమ్మడి జిల్లాలో జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి. అదేవిధంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, లా కాలేజీలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.
- ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేయాలి. ప్రతీ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24గంటలు నడిచేలా ఏర్పాటు చేయడంతో పాటు, 30 పడకల స్థాయికి పెంచాలి.
- మోత్కూరులో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలి.
- ఉమ్మడి జిల్లాలో

మిగతా 7వ పేజీలో...



యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

సభకు సర్వం సిద్ధం

తుర్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో సీఎం సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుగనుంది. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ. 1,500కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం ఇక్కడే శంకుస్థాపన చేస్తారు. తదనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అందుకు భువనగిరి-గజ్వేల్ రహదారి పక్కన ఐదెకరాల విస్తీర్ణంలో సభా వేదిక నిర్మాణంతో పాటు ప్రజలు కూర్చునేందుకు వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం మరో 20ఎకరాల స్థలాన్ని కేటాయించారు. వేదిక ముందు భాగంలో మీడియా, వీఐపీ, ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వీఐపీల పార్కింగ్‌కు మరో నాలుగు స్థలాలతోపాటు ప్రజలు సభా ప్రాంగణానికి రెండు వైపుల నుంచి వచ్చేలా ఏర్పాటుచేశారు.

రెండు పెద్ద ఎల్ఈడీ తెరలు

సభా వేదికను 60 అడుగుల పొడవు 40 అడుగుల వెడల్పుతో 100 కూర్చునేందుకు అనువుగా ఏర్పాటు చేశారు. సభా వేదికకు ఇరువైపులా ప్రజలు వీక్షించేందుకుగా రెండు పెద్ద ఎల్ఈడీ తెరలు, అక్కడక్కడ చిన్న చిన్న ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. సభా వేదికకు సుమారు

మిగతా 7వ పేజీలో...

నేటి నుంచి బడిబాట

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు లక్ష్యం
- ఉపాధ్యాయులకు పరీక్షగా మారిన అడ్మిషన్లు
- ఇప్పటికే ప్రారంభమైన ప్రైవేట్ పాఠశాలల ప్రచార జోరు



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు (ఫైల్)

నల్లగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం (2025-26) ఈ నెల 12న ప్రారంభం కానుంది. దీంతో ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నిర్వహించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట పేరుతో పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది.

విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు మల్టీకలర్ కరపత్రాలు, బ్యానర్లతో పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతీ ఇంటికి తిరుగుతున్నారు. పాఠశాలల ఘనత, సాధించిన ఫలితాలను వివరిస్తూ పిల్లలను చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే యాజమాన్యాలు కూడా టీచర్లకు టార్గెట్ విధించి అడ్మిషన్ల సంఖ్య ఆధారంగా ఇన్సెంటివ్స్ ఇస్తుండగా, కొన్ని పాఠశాలలు నిర్దేశిత సంఖ్యలో నూతన విద్యార్థులను చేర్పిస్తేనే వేసవి వేతనం ఇస్తామని తేల్చిచెప్పాయి. అంతేగాక విద్యార్థులను చేర్పించని ఉపాధ్యాయులను తొలగిస్తామంటూ హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు అధికమంది పేద, మధ్య తరగతికి చెందినవారే ఉండటంతో వారి జీవనోపాధిని కాపాడుకునేందుకు ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా సాధారణ ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అలాంటి కఠినతర ఇబ్బందులు లేకున్నా, పాఠశాలల్లో ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను నిర్వహించనున్నారు. కనీస సంఖ్యలేని పాఠశాలలను మూసివేస్తూ ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు తాత్కాలిక సర్దుబాటు చేసే

మిగతా 7వ పేజీలో...

పునఃప్రారంభానికి ముందే

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఈనెల 12వ తేదీలోగా తరగతి గదులు, పరిసరాలను శుభ్రం చేయించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు పుస్తకాలు, ఒక జత యూనిఫాం పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు భవిత కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచనున్నారు. భవిత కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించి పరిపాలన అనుమతులు మంజూరు చేయగా, పనులు కొనసాగుతున్నాయి. బడిబాటలో భాగంగా వీటిలో విద్యార్థులను చేర్పించనున్నారు.

పేదల ఇంటికల నెరవేర్చే వరకూ పోరాటం



మునుగోడులో ఇందిరమ్మ ఇళ్ల పట్టాను లబ్ధిదారుకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మునుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరే వరకూ పోరాడుతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పండుగ వాతావరణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టి అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దశల వారీగా పేదలందరికీ ఇవ్వాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గ పరిధిలో 10వేల మంది అర్హులు ఉంటారని, కానీ తొలి విడతలో 3,500 ఇళ్లు మాత్రమే వచ్చాయన్నారు. మిగిలిన అర్హులందరికీ ఇప్పించే బాధ్యత తనదని, ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని హితవు పలికారు. ఇల్లు అనేది ఆత్మగౌరవమని, ఇంటితోనే మహిళకు అందం వస్తుందన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు ఇళ్లు ఇవ్వడం సంతోషకరమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మిగతా వారికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 200 మంది లబ్ధిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి జాబితాను 5శాతం ర్యాండంగా పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో 2,100మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు 30రోజుల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌ఖుమార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నారాయణ అమిత్, జె.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదమా.. అనుమానాస్పదమా?

- మారెడ్డి శిల్ప మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు
- స్టేషన్‌లో ఫిర్యాదు



వివరాలు 6లో

సాగర్ కుడికాల్వకు నీటివిడుదల నిలిపివేత

- 13 క్రస్ట్‌గేట్లకు కొనసాగుతున్న మరమ్మతులు
- రెండు రోజుల్లో పూర్తి



వైభవంగా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ



జాతర ప్రారంభ పూజల్లో పాల్గొన్న చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతులు, ఈవో జయరామయ్య, ఆలయ ధర్మకర్తలు

కనగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, లలితసహస్రనామార్చనలు, బాలభోగ నివేదనలు జరిగాయి. అనంతరం ఉదయం ధ్వజారోహణ, దేవీమూలమంత్ర హోమాలు, మండప పూజలు, నీరాజన మంత్రపుష్పం, మహానివేదన, గవ్యాంతపూజలు, వాస్తు పూజ, నిత్యహోమాలు, విఘ్నేశ్వరపూజలు, స్వస్తివాచనం, సాయంత్రం యాగశాల మండప పూజలు, నీరాజన మంత్రపుష్పం, ఎదుర్కోళ్ల మహోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కాగా శుక్రవారం ఉదయం 10:30 గంటలకు రేణుకాఎల్లమ్మఅమ్మవారు,జమదగ్నిమహామునిల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సబిత దంపతులు హాజరై పట్టువస్త్రాలు, తలంబ్రాలను ప్రభుత్వం తరఫున అందజేయనున్నారు. కల్యాణానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద తగు ఏర్పాట్లను పూర్తి చేశారు. కల్యాణంతరం భక్తులకు ఆలయ కమిటీ తరఫున అన్నదానం ఏర్పాటుచేశారు. ఇదిలావుంటే అమ్మవారి కల్యాణానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య కోరారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్లు చంద్రయ్య, నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, రాజయ్య, నాగరాజు, సిబ్బంది శ్రీకర్, రాజు, ధర్మకర్తలు నగేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, శంకర్‌రెడ్డి, రాజు, రమేష్, వెంకన్న, బాబు, సైదులు, దుర్గమ్మ, రమేష్, ప్రభాకర్, ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమారాచార్యులు, అర్చకులు ఉమామహేశ్వరరావు, దామోదర్‌రావు, శ్రీనివాస్‌చారి, ఫణికుమార్‌చార్యులు పాల్గొన్నారు.



పైలాన్‌కాలనీలోని పాత బీఈడీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఇతర అధికారులు

బీసీ డిగ్రీ గురుకుల కళాశాల తరలింపు యోచన

నాగార్జునసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పైలాన్‌కాలనీలోని పాతబీఈడీ కళాశాల భవనంలోకి హిల్‌కాలనీలోని గురుకుల బీసీ డిగ్రీ కళాశాలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తెలిపారు. గురువారం పాతబీఈడీ కళాశాల భవనాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బీసీ గురుకుల పాఠశాల, కళాశాల, డిగ్రీ కళాశాల ఒకే చోట నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలను పైలాన్‌కాలనీలో ఖాళీగా ఉన్న పాతబీఈడీ కళాశాల భవనంలోకి తరలించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే గతంలో బీసీ గురుకుల పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి ఏర్పాటుతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలను ఎంపీ రఘువీర్‌రెడ్డితో పాటు తాను సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఆ మేరకు త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బీసీ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ రవికుమార్, మాధవీలత, నాయకులు జంగయ్య, ఉంగరాల శ్రీను, పగడాల నాగరాజు, వేణు, హబీబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య: టీఎస్‌యూటీఎఫ్



చింతపల్లి ర్యాలీలో ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు

చింతపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి తెలిపారు. గురువారం చింతపల్లిలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ఊరు-మన బడి ప్రచారజాతను ప్యాక్స్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య ప్రారంభించారు. చింతపల్లి, వింజమూరు, కుర్మపల్లి, తక్కళ్లపల్లి, గొల్లపల్లి, చాకలిశేరుపల్లి, ఉమ్మాపురం, పోలేపల్లిరాంనగర్, గొడకొండ్ల, వెంకటేశ్వరనగర్(మాల్)తో పాటు పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ, సామాజిక కార్యకర్త వారాల రామచంద్రం, జిల్లా సభ్యుడు గనిమల్ల శ్రీరాములు, మండల ప్రధానకార్యదర్శి ముసుగు ఆనంద్ బాబు, మండల ఉపాధ్యక్షుడు బుడిగపాక వెంకటేశం, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాసవి పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



బీసీ భవన్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వనాలను పెంచితే ప్రజలకు హితాన్ని కలుగజేస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఎన్నెస్పీ క్యాంప్‌లో పూలే భవన్, అంబేడ్కర్ భవన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోల్పోతే కాలచక్రంలో పెనుమార్పులు చోటుచేసుకుంటాయన్నారు. అతివృష్టి అనావృష్టి పరిస్థితితులు నెలకొంటాయన్నారు. మిర్యాలగూడలో జనసాంద్రత అధికంగా ఉన్నందున ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్నారు. పరిశ్రమలు అధికంగా ఉండటంతో వాటి ద్వారా వెలువడే వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతినకుండా మొక్కలు పెద్దసంఖ్యలో నాటాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎండీ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి చిలుకూరి బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, దేశిడి శేఖర్‌రెడ్డి, సలీం, సమభావన సంఘాల మహిళలు, డీఈ వెంకన్న, మెప్మా అధికారి బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటలాడేదెలా?



క్రీడా ప్రాంగణం లేక పొలం గట్లపై ఆడుకుంటున్న చిన్నారులు

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- పెరిగిన పిచ్చిమొక్కలు, కంప చెట్లు
- వృథాగా క్రీడా సామగ్రి

వేములపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడంతో పాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలనే తలంపుతో గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రెవెన్యూశాఖ మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమిని కేటాయించగా మరికొన్ని చోట్ల అవసరమైన మేరకు భూమి లేక ఆయా పాఠశాలల ఆవరణలలో క్రీడా ప్రాంగణాలకు స్థలాన్ని కేటాయించారు. లక్షలాది రూపాయలతో భూమిని చదును చేసి మట్టి పోసి క్రీడాకారులు ఆడుకునే విధంగా వాటిని అభివృద్ధి చేశారు. అంతేకా అవసరమైన క్రీడా సామగ్రిని కూడా గ్రామపంచాయతీలకు అందించారు. కొంతకాలంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో క్రీడాప్రాంగణాలు పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి నిరూపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో పిల్లలు, యువకులు పొలం గట్లపైకి వెళ్లి ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ విస్తీర్ణాన్ని బట్టి అధికారులు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు సమయంలోనే ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడా సామగ్రిని ఆయా గ్రామాలకు సైతం పంపిణీ చేశారు. అవి కార్యాలయాలకే పరిమితమయ్యాయి. కొన్ని క్రీడా ప్రాంగణాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులకు కాకుండా మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రాళ్లు రప్పలతో నిరుపయోగంగా దర్శనమిస్తున్న లక్ష్మీదేవిగూడెం గ్రామంలోని క్రీడా ప్రాంగణం

వినియోగంలోకి తెచ్చేందుకు కృషి

మండలంలోని పలు గ్రామాల్లో ఏ ర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి వాటి నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయాం. ఈ విషయాన్ని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తాం.

\- లలిత, ఎంపీవో, వేములపల్లి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూసార పరీక్షలు చేయించాలి

కిశోర్‌నాయక్, ఏవో, వేములపల్లి



పంటలు సాగు చేయడానికి ముందు రైతులు తమ భూమికి సంబంధించి భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. తద్వారా భూసారం ఆధారంగా ఏ పంటలు సాగు చేయాలి. ఏ ఎరువులు వాడాలనే విషయాలు తెలుసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని అన్నారు. ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(వేములపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: భూసార పరీక్షల వల్ల రైతులకు కలిగే లాభాలు ఏమిటి?

ఏవో: భూసార పరీక్షలు ప్రతీ రెండేళ్లకోసారి చేయించుకోవడం మంచిది. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు భూసారాన్ని కాపాడుకొని సుస్థిరమైన దిగుబడులను పొందేందుకు ఆస్కారం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: పచ్చిరొట్ట ఎరువు వల్ల కలిగే లాభాలు తెలుపగలరు.

ఏవో: పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం ద్వారా భూమికి సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. తద్వారా నేల సారాన్ని పెంచుకొని అధిక దిగుబడిని పొందవచ్చు. ప్రస్తుతం వేములపల్లి ప్రాథమిక సహకార సంఘంలో అవసరమైన మేరకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వాటిని వినియోగించకోవచ్చు

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు?

ఏవో: ఇప్పటివరకు మండలంలో 1650 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు. మిగిలిన రైతులందరు ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారుల వద్దకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింకు ఉన్న ఫోన్ నెంబర్లను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలి.

ఆంధ్రజ్యోతి: రాయితీపై ఏమైనా యంత్రాలు అందిస్తున్నారా?

ఏవో: ప్రస్తుతానికి వ్యవసాయశాఖ ద్వారా యాంత్రిక పరికరాలు రాయితీపై అందుబాటులో లేవు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే వాటిని అందించేందుకు కృషి చేస్తాం.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



దేవరకొండ ఖిల్లాలోని పార్కులో మొక్కలు నాటుతున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, మిర్యాలగూడఅర్బన్, నాగార్జునసాగర్, మిర్యాలగూడటౌన్, హాలియా, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మొక్కలు నాటి మాట్లాడారు. ప్రజలందరూ ఇంటింటికీ మొక్కలు నాటాలని కోరారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలను విరివిగా నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. జీవుల మనుగడ ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకు పర్యావరణ ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను వాడవద్దని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, మొక్కలను నాటాలని నినాదాలిచ్చారు. ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పచ్చదనాన్ని పరిరక్షించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు.

● దేవరకొండలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఖిల్లాలోని పార్కులో గురువారం ప్రపంచ పర్యావరణం దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటి మాట్లాడారు. మునిసిపాలిటీలోని సమస్యలన్నీ పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు శత్రునాయక్, జగమంతు, వార్డు అధికారులు, మహిళ సంఘాలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

● దేవరకొండ, కంభాలపల్లి రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో అధికారులు దేవరకొండ అటవీశాఖ కార్యాలయం నుంచి దేవరకొండ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు షాజావుద్దీన్, హష్మి, ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్రీదేవి, సుమన్, కిరణ్‌కుమార్, వెంకటయ్య, చంద్రకళ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్ పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి తీరని ముప్పువాటిల్లుతోందని అన్నారు. ప్రజల జీవనవిధానంలో భాగమై వినియోగంలోకి వచ్చిన ప్లాస్టిక్‌తో భూభాగం సాధారణ స్థితిని కోల్పోయి వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణ ప్రేమికులు ప్రజలను చైతన్యపరచాలని కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి వెంకటాద్రిపాలెం గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ అవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, దామరచర్ల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సంతోష్‌కుమార్, అశోక్ రెడ్డి, రేంజ్ అధికారులు ముఖేష్, విక్రమ్, కవిత, ప్రీతి, మమత, కట్టెబోయిన అంజయ్య, వెంకన్న, జ్ఞానేశ్వరి, వెంకటరమణ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. బీసీభవన్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నేటి మొక్కలే రేపటి వృక్షాలని, నాటిన మొక్కలను సంరంక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఇంపాక్ట్ ఇటర్నేషనల్ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యానగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ, సంస్థ బోర్డు సభ్యుడు నూనె సుదర్శన్, రీజనల్ ట్రెజరర్ కోట సరిత, సెక్రటరీ మామిడి రోజ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవిశాఖ అధికారులు

● నాగార్జునసాగర్‌లో అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో రమేష్ ఆధ్వర్యంలో అటవీ శాఖ డివిజన్ పరిధిలో సమ్మక్క-సారక్క వద్ద ఉన్న అర్బన్ పార్కు నుంచి నెల్లికల్ స్టేజీ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్లాస్టిక్ బాటిల్‌లను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. అనంతరం అర్బన్ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు రవీందర్‌రెడ్డి, రాములు, శేఖర్‌రెడ్డి, అటవీశాఖ, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీ పరిధిలోని మలిగిరెడ్డి లింగారెడ్డి వెంచర్‌లో ఏక్ పెడ్ మాకే నామ్ థీమ్‌తో మునిసిపాలిటీ కమిషనర్ రామదుర్గారెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలను పెంచి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ వార్డు అధికారులు, మెప్మా, టీఎంసీ, ఆర్పీలు, మునిసిపాలిటీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో మొక్క నాటుతున్న మునిసిపల్ అధికారులు



అర్బన్ పార్కు నుంచి నెల్లికల్ స్టేజీ వరకు రోడ్ల వెంట ఏరివేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఈ ఏడాదిలోనే కులగణన చేపట్టాలి

● *బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్*



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలోనే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 మార్చిలో కులగణన షెడ్యూల్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీజేపీకి బీసీల ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని ఈ ప్రకటన స్పష్టం చేస్తోందని అన్నారు. త్వరలో జరగబోయే తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీల ఓట్లను ఆకర్షించే ఎత్తుగడగా ఈ ప్రకటన ఉందని పేర్కొన్నారు. ప్రకటనలతో కాలయాపన చేయడం వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఇప్పటికే బీసీలకు దక్కాల్సిన వాటా దక్కకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం షెడ్యూల్‌ను సవరించి 2025లోనే కులగణన చేపట్టాలని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట సుధాకర్, దోనేటి శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రచారజాతలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

దామరచర్ల, అడవిదేవులపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాత గురువారం దామరచర్ల, అడవిదేవులపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాల నడుమ నాణ్యమైన విద్య అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉన్నత కొలువుల్లో ఉన్నారని, ఆయా రంగాల్లో ఉన్నత స్థానానికి చేరుకున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు భోజనం, యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం మండల కార్యదర్శి చెలకపల్లి శ్యామ్‌కుమార్, నాయకులు పులి సత్యనారాయణ, భైరం శేఖర్, సట్టు రాము, రజబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను 'భూభారతి'లో నమోదు చేయాలి

● *దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి*



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులలో రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూభారతి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆర్డీవో రమణారెడ్డి తహసీల్దార్లకు సూచించారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు డిప్యూటీ తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని పరిష్కారమయ్యాయి. జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యే దరఖాస్తులు ఎన్ని ఉన్నాయని తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలని, రైతులు ఇచ్చిన భూసమస్యలన్నీ పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్ మామ ప్రసాద్ మృతి

● *పలువురు నాయకుల సంతాపం*



ప్రసాద్ (ఫైల్ ఫొటో)

దేవరకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఎమ్మెల్యే బాలునాయక్ మామ మద్దెల ప్రసాద్(82) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం కామినేని ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని దేవరకొండలోని స్వగృహానికి తీసుకువచ్చారు. అనంతరం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రసాద్‌కు కుమార్తె జ్యోతి ఉన్నారు. ప్రసాద్ మృతిపట్ల జాన్సన్, పురుషోత్తం, ఐజాగ్, డానియెల్, ప్రసన్నకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు, కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మామ మద్దెల ప్రసాద్ బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన పట్టణంలో ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

చింతపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీచర్ల అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని, అక్రమ డిప్యుటేషన్‌కు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కుర్మేడ్‌కు చెందిన న్యాయవాది గుర్రం వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. నెల్వలపల్లి ప్రాథమిక పాఠశాలలో డీఎస్సీ ద్వారా నియామకం పొంది అధ్యాపకులుగా పని చేస్తున్నారని. నేరడుగొమ్ము మండలం దాసర్లపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై గొడకొండ్లలో విధులు నిర్వహిస్తున్నారని, దేవరకొండ మండలంలోని ఎంపీపీఎస్ నుంచి గొడకొండ్లలో అక్రమంగా పని చేయడం సరికాదన్నారు. అక్రమ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న టీచర్లపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

వేములపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో గురువారం శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితులు శ్రీనారాయణం సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సైతం కల్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివార్ల కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వేములపల్లి ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి